EDITORIAL సంపాదకీయం

# తెలంగాణ జీవనతత్వం మల్లన్న జాతర...

తెలంగాణ ప్రజాజీవితాన్ని వారు కొలిచే దేవుళ్లలో చూడాలి. ఆ దేవుళ్లు గర్భగుడుల్లో కాదు, రాజభవనాల్లో కాదు... పల్లెపొలాల మధ్య, శ్రమజీవుల చెమటతో, నమ్మకం మధ్యలో ఉంటారు. అటువంటి ప్రజాదేవతలలో ఐనవోలు మల్లన్న ముందు వరుసలో ఉంటారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఐనవోలు గ్రామంలో ఏటా సంక్రాంతి నుంచి ఉగాది దాకా సాగే మల్లన్న జాతర కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమంలా కాకుండా... అది తెలంగాణ గ్రామీణ సమాజ జీవన తత్వానికి అద్దం పడుతుంది.



కాకతీయుల కాలం నుంచే స్వయంభువుగా పూజలందుకుంటున్న మల్లన్నను శివుని రూపంగా భావిస్తారు. రాజుల ఆలయాలకంటే ముందే ప్రజల గుండెల్లో నిలిచిన దేవుడు ఆయన. యాదవులు, బలహీన వర్గాలు, దళితులు, గిరిజనులు తరతరాలుగా తమ కష్టసుఖాలను మల్లన్నతో పంచుకుంటూ వస్తున్నారు. పంటలు పండాలన్నా, వ్యాధులు తగ్గాలన్నా, కుటుంబాల్లో శాంతి నిలవాలన్నా మల్లన్ననే ఆశ్రయించడం ఈ ప్రాంత ప్రజల జీవన నమ్మకంగా మారిపోయింది.

ఈ జాతర ప్రత్యేకత ఏంటంటే కులం... మతం, ప్రాంతాల హద్దులు లేవు.తెలంగాణతో పాటు ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్రల నుంచి కూడా లక్షలాది భక్తులు ఐనవోలుకు తరలివస్తారు. ఇది మత సంబంధిత ఉత్సవం కంటే ఎక్కువగా ఒక సామాజిక సంఘటనగా చూడాలి. ప్రజల నమ్మకాలు, వారి జీవన పోరాటాలు ఈ జాతరలో ఒకే చోట కలుస్తాయి.

జాతర మొదలయ్యే రోజుల్లో ఐనవోలు గ్రామం జన సంద్రంగా మారుతుంది. ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు, ఆటోలు, కాలినడకన వచ్చే భక్తులతో గ్రామ పరిసరాలు కిటకిటలాడతాయి. మొక్కులు తీర్చుకునే భక్తులు కోడెపోతులు, గొర్రెలు, కోళ్లు సమర్పిస్తూ తమ కోరికలను దేవుడి ముందు ఉంచుతారు. ఆధునిక దృష్టికి ఇవి పాత ఆచారాలుగా కనిపించినా, గ్రామీణ సమాజంలో ఇవే విశ్వాసానికి మూలస్తంభాలు. డప్పుల మోత, జానపద గీతాలు, పోతరాజుల నృత్యాలు మల్లన్న జాతరను తెలంగాణ జానపద సంస్కృతికి ప్రతిరూపంగా నిలబెడతాయి. పోతరాజును మల్లన్న దూతగా ప్రజలు విశ్వసిస్తారు. అతని నృత్యం, అరుపులు ప్రజల ఆర్తనాదానికి ప్రతిబింబం అవుతాయి. ఇది అధికారిక మత వ్యవస్థ కాదు. ప్రజల జీవన అనుభవాల నుంచి రూపుదిద్దుకున్న దేవతా సంప్రదాయం.


ఇంతటి ప్రాముఖ్యత ఉన్న జాతర గతంలో అనేక ఇబ్బందులతో కొనసాగింది. రోడ్ల దుస్థితి, తాగునీటి కొరత, పారిశుద్ధ్య లోపాలు, వైద్య సదుపాయాల లేమి, లక్షలాది మంది తరలివచ్చే ఈ జాతరకు పెద్ద సవాళ్లుగా మారాయి. ప్రజల విశ్వాసం ఉన్నా, పాలనా వ్యవస్థ నుంచి తగిన స్థాయి స్పందన లేకపోవడం పలు సందర్భాల్లో విమర్శలకు దారి తీసింది.

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలిచి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఐనవోలు మల్లన్న జాతరపై ప్రత్యేక దృష్టి సారించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజల విశ్వాసాలకు పాలనా బాధ్యతను జోడించే దిశగా ప్రభుత్వం అడుగులు వేయడం ఒక సానుకూల పరిణామంగా మారింది. జాతర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించడం, రహదారుల అభివృద్ధి చేపట్టడం, భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం ఇందుకు ఉదాహరణలు.

శాశ్వత తాగునీటి సౌకర్యాలు, తాత్కాలిక నీటి ట్యాంకులు, మంచినీటి పాయింట్ల ఏర్పాటు ద్వారా భక్తుల అవసరాలను తీర్చే ప్రయత్నం జరుగుతోంది. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అదనపు సిబ్బంది, మొబైల్ టాయిలెట్లు, చెత్త తొలగింపు వ్యవస్థలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. జాతర రోజులలో వైద్య అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచడం కూడా కీలకమైన చర్యగా చూడాలి.

ముఖ్యంగా జాతరను కేవలం పర్యాటకోత్సవంగా మార్చకుండా, ప్రజల విశ్వాసాలకు భంగం కలగకుండా అభివృద్ధి చేయాలన్న దృక్పథాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టంగా వ్యక్తం చేయడం గమనార్హం. అభివృద్ధి పేరుతో ప్రజా సంస్కృతి నశించకూడదన్న ఆలోచన ఈ విధానాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. సమ్మక్క-సారలమ్మ, మేడారం జాతరల తరహాలో ఐనవోలు మల్లన్న జాతరను కూడా రాష్ట్ర స్థాయి ప్రజాసాంస్కృతిక ఉత్సవంగా తీర్చిదిద్దాలన్న ఆలోచనకు ఇది తొలి అడుగు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రజా సంస్కృతి, జానపద సంప్రదాయాలకు ఇచ్చే ప్రాధాన్యం విధానాల రూపంలో మరింత బలపడాల్సిన అవసరం ఉంది. ఐనవోలు మల్లన్న జాతరపై సమగ్ర అధ్యయనం, డాక్యుమెంటేషన్, పరిశోధన చేపట్టి, ఈ ప్రజా సంపదను రాబోయే తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. మొత్తానికి ఐనవోలు మల్లన్న జాతర ఒక మత ఉత్సవం మాత్రమే కాదు. అది తెలంగాణ ప్రజల జీవన తత్వానికి అద్దం. భక్తి, శ్రమ, సంస్కృతి, సామాజిక సమైక్యత ..ఈ నాలుగింటి సంగమం. కాలం మారినా, ప్రభుత్వాలు మారినా మల్లన్న ప్రజల గుండెల్లో నిలిచే దేవుడు. కాబట్టి మల్లన్న దేవుడు ఆశీర్వదించేలా కాంగ్రెస్ ప్రజా పాలన కొనసాగడం రాష్ట్రానికి శుభ సూచకం!!


-అమరవాజీ నాగరాజు
టీపీసీసీ చీఫ్ పీఆర్ఓ







# మేడారం జాతర సందడి






రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp:
74369 39999

# స్టాక్ మార్కెట్ క్రాష్.. ప్రధాన కారణాలు ఇవే!

దేశీయ స్టాక్ మార్కెట్లు రెండో రోజు భారీ నష్టాన్ని చవిచూశాయి. సెన్సెక్స్ 1,092.44 పాయింట్ల నష్టంతో 82,153.74 వద్ద, నిఫ్టీ 360.05 పాయింట్ల నష్టంతో 25,225.45 వద్ద నిలిచాయి. స్టాక్ మార్కెట్ భారీ నష్టాల్లో ముగియడంతో.. ఒక్క రోజులోనే మదుపర్ల సంపద రూ.9 లక్షల కోట్ల వరకు ఆవిరైంది. ప్రస్తుత పరిస్థితులు.. పెట్టుబడిదారులలో భయాన్ని రేకెత్తించాయి. సోమవారం మొదలైన అమ్మకాల ఒత్తిడి.. ఈ రోజు (జనవరి 20) కూడా కొనసాగడంతో.. దలాల్ స్ట్రీట్ నేలచూపులు చూస్తోంది. స్టాక్ మార్కెట్ భారీగా పడిపోవడానికి ప్రధాన కారణాలు ఏమిటనే విషయానికి వస్తే..

**స్టాక్ మార్కెట్ పతనం: ప్రధాన కారణాలు**

**వాణిజ్య యుద్ధ భయాలు:**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవాలన్న దూకుడు వైఖరితో పాటు, యూరప్ దేశాలపై టారిఫ్‌లను విధిస్తామనే హెచ్చరికలు చేయడం ప్రపంచ మార్కెట్లను కలవరపెడుతున్నాయి. యూరోపియన్ యూనియన్ కూడా ప్రతీకార టారిఫ్‌లపై ఆలోచిస్తోందన్న వార్తలు అంతర్జాతీయ వాణిజ్య యుద్ధ భయాలను పెంచాయి. ఈ అనిశ్చిత పరిస్థితి భారత మార్కెట్‌పై కూడా ప్రతికూల ప్రభావం చూపుతోంది.

**క్యూ3 (Q3) ఫలితాలు:**

మూడో త్రైమాసిక కార్పొరేట్ ఫలితాలు ఆశించిన స్థాయిలో ఉత్సాహాన్ని ఇవ్వలేకపోయాయి. లాభాల్లో పెద్దగా పాజిటివ్ సర్ప్రైజ్‌లు లేకపోవడం వల్ల ఇప్పటికే బలహీనంగా ఉన్న మార్కెట్ సెంటిమెంట్ మరింత తగ్గింది. అయితే ఆటో రంగ ఫలితాలు కొంత ఊరటనిచ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

**విదేశీ అమ్మకాలు:**

జనవరిలో ఇప్పటివరకు విదేశీ పెట్టుబడిదారులు సుమారు రూ. 29,000 కోట్ల విలువైన ఇండియా షేర్లను విక్రయించారు. భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి, డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనత, లాభాలు విలువల మధ్య అసమతుల్యత వంటి అంశాలు ఈ విక్రయాలకు కారణమయ్యాయి. ఇది కూడా మార్కెట్ పతనానికి ప్రధాన కారణమైంది.

**పెట్టుబడులు:**

పెట్టుబడిదారులు స్టాక్ మార్కెట్లకు ప్రత్యామ్నాయంగా.. బంగారం, వెండి వంటి సురక్షిత పెట్టుబడుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇది కూడా మార్కెట్ పతనానికి ఒక కారణం.

**బడ్జెట్ 2026:**

ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌పై మార్కెట్ భారీ అంచనాలతో ఎదురుచూస్తోంది. ఆర్థిక వృద్ధి, ఉద్యోగ సృష్టి, వినియోగ డిమాండ్ పెంచే చర్యలు ఉంటాయని ఆశిస్తున్నారు. అయితే ఆర్థిక లోటు నియంత్రణపై ప్రభుత్వం ఎక్కువ దృష్టి పెట్టి, మూలధన వ్యయాన్ని తగ్గిస్తుందేమో అన్న భయం పెట్టుబడిదారుల్లో జాగ్రత్తను పెంచుతోంది.




# టయోటా తొలి ఎలక్ట్రిక్ కారు.. 543 కిమీ రేంజ్!

టయోటా భారతదేశంలో తన మొదటి ఎలక్ట్రిక్ కారు 'అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా'ను అధికారికంగా ఆవిష్కరించింది. దీనిని ఇప్పటికే మార్కెట్లో అందుబాటులో ఉన్న మారుతి సుజుకి ఈవిటారా ఆధారంగా రూపొందించారు. కాబట్టి డిజైన్, ఫీచర్స్, ఇంజిన్ వంటివన్నీ కూడా.. దాదాపు విటారాలో ఉన్నట్లుగానే ఉన్నాయి. టయోటా అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా బాడీ షెల్ ఈవిటారా మాదిరిగా ఉన్నప్పటికీ.. ఒక ప్రత్యేకమైన ఫ్రంట్ ఫాసియాను కలిగి ఉంది, ఎల్ఈడీ డీఆర్ఎల్‌లతో సొగసైన హెడ్‌ల్యాంప్‌లు, విభిన్నమైన ఫ్రంట్ బంపర్‌ను కలిగి ఉంది. ఇది ఈవిటారా లాగా లైట్ బార్ ద్వారా కనెక్టెడ్ ఎల్ షేప్ టెయిల్‌లైట్‌లను పొందుతుంది. లోపల భాగంలో అర్బన్ క్రూయిజర్ ఈవీ.. ఈవిటారాలో మాదిరిగానే అదే డాష్‌బోర్డ్‌ను పొందుతుంది. ఇది డ్యూయల్ స్క్రీన్ లేఅవుట్‌ను కలిగి ఉంది. ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్, వైర్‌లెస్ ఛార్జర్, పవర్డ్ డ్రైవర్ సీటు, సన్‌రూఫ్, జేబీఎల్ ఆడియో సిస్టమ్, ఆండ్రాయిడ్ ఆటో & ఆపిల్ కార్‌ప్లే కనెక్టివిటీ, 360 డిగ్రీ కెమెరా, లెవల్ 2 ఏడీఏఎస్ వంటి అనేక లేటెస్ట్ ఫీచర్స్ ఈ కారులో ఉన్నాయి. భారతదేశంలో,




అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా రెండు బ్యాటరీ ఎంపికలతో (49 kWh & 61 kWh) లభిస్తుంది. 49 కిలోవాట్ బ్యాటరీ కలిగిన వేరియంట్ 142 bhp & 189 Nm శక్తిని అందించే ఎలక్ట్రిక్ మోటారును.. 61 కిలోవాట్ బ్యాటరీ 172 bhp & 189 Nm టార్క్ అందించే మరింత శక్తివంతమైన మోటారుతో వస్తుంది. పెద్ద బ్యాటరీ 543 కిమీ వరకు ప్రయాణించగలదని సమాచారం.

టయోటా అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా 5 మోనోటోన్ (కేఫ్ వైట్, బ్లూయిష్ బ్లాక్, గేమింగ్ గ్రే, స్పోర్టిన్ రెడ్, ఎంటైసింగ్ సిల్వర్) కలర్స్, 4 డ్యూయల్‌టోన్ కలర్ (కేఫ్ వైట్/బ్లాక్ రూఫ్, ల్యాండ్ బ్రీజ్ గ్రీన్/బ్లాక్ రూఫ్, స్పోర్టిన్ రెడ్/బ్లాక్ రూఫ్ & ఎంటైసింగ్ సిల్వర్/బ్లాక్ రూఫ్) ఎంపికలలో లభిస్తుంది. కాగా కంపెనీ ఈ కారు ధరలను లాంచ్ సమయంలో వెల్లడించనుంది.

# సహజ వజ్రాలకే డైమండ్ గుర్తింపు

వజ్రాల కొనుగోలులో వినియోగదారులు ఎదుర్కొంటున్న గందరగోళానికి తెరదించుతూ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(BIS) సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై 'డైమండ్' అనే పదాన్ని కేవలం సహజ సిద్ధంగా లభించే వజ్రాలకే ఉపయోగించాలని స్పష్టం చేస్తూ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకు, మార్కెట్‌లో పారదర్శకతను పెంచేందుకు బీఐఎస్ తాజాగా IS 19469:2025 అనే కొత్త ప్రమాణాన్ని ఆమోదించింది. ఇది అంతర్జాతీయ ప్రమాణమైన ISO 18323:2015 (జ్యువెల్లరీ: డైమండ్ పరిశ్రమలో వినియోగదారుల విశ్వాసం)కు అనుగుణంగా రూపొందించినట్లు తెలిపింది.



## కొత్త మార్గదర్శకాల్లోని అంశాలు

భూగర్భంలో సహజంగా ఏర్పడిన వజ్రాలను మాత్రమే 'డైమండ్'గా పరిగణిస్తారు. విక్రేతలు వీటిని మరింత స్పష్టంగా చెప్పాలనుకుంటే 'నేచురల్', 'రియల్', 'జెన్యూన్' లేదా 'ప్రీషస్' వంటి విశేషణాలను జోడించవచ్చు. ప్రయోగశాలల్లో కృత్రిమంగా తయారుచేసే వజ్రాల విషయంలో విక్రేతలు అత్యంత జాగ్రత్తగా ఉండాలి. వీటిని విక్రయించేటప్పుడు కచ్చితంగా 'laboratorygrown diamond' లేదా 'laboratorycreated diamond' అనే పూర్తి పదాలను వాడాలి. ఇకపై ల్యాబ్ వజ్రాల కోసం LGD, labgrown, labdiamond వంటి షార్ట్ కట్ పేర్లను వాడటం నిషిద్ధం. ల్యాబ్ వజ్రాలను విక్రయించేటప్పుడు 'నేచర్స్', 'ప్యూర్', 'ఎర్త్‌ఫ్రెండ్లీ' లేదా 'కల్చర్డ్' వంటి పదాలను ఉపయోగించకూడదని బీఐఎస్ ఆదేశించింది. కేవలం బ్రాండ్ పేరుతో వీటిని విక్రయించడం కూడా నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తుంది.

## పరిశ్రమ వర్గాల స్పందన

బీఐఎస్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని న్యాచురల్ డైమండ్ కౌన్సిల్ (NDC) స్వాగతించింది. ఎన్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ రిచా సింగ్ మాట్లాడుతూ.. 'ఈ కొత్త ప్రమాణాలు వినియోగదారులకు ఎంతో కాలంగా అవసరమైన స్పష్టతను ఇస్తాయి. సహజ వజ్రాల విశిష్టతను ఇవి కాపాడతాయి' అని పేర్కొన్నారు. అటు జ్యువెల్లరీ వ్యాపారులు కూడా ఈ మార్పుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. డైమండ్ పదజాలంలో అయోమయం తొలగించడం వల్ల పరిశ్రమ మరింత బలపడుతుందని అభిప్రాయపడుతున్నారు.

## దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL

# గ్రీన్‌ల్యాండ్‌పైకి అమెరికా యుద్ధ విమానాలు

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నంత పనీ చేయబోతున్నారా?.. గ్రీన్‌ల్యాండ్‌ను చేజిక్కించుకోవాలనే ప్రయత్నాల్లో దూకుడు ప్రదర్శిస్తున్నారా?.ఈ క్రమంలోనే సైన్యాన్ని గ్రీన్‌ల్యాండ్‌లోకి దింపబోతున్నారా?. ఈ తరుణంలో డెన్మార్క్ ఆందోళనలో అర్థం ఉందా?.. అసలు దీనంతటికి కారణమైన నోరాడ్ అంటే ఏంటసలు?..**



గ్రీన్‌ల్యాండ్‌లోని పిటుఫిక్ స్పేస్ బేస్‌కి అమెరికా తన యుద్ధ విమానాలు పంపడం ఆర్కిటిక్ ప్రాంతంలో రాజకీయ, సైనిక ఉద్రిక్తతలకు దారితీసింది. అగ్రరాజ్యం చర్యపై డెన్మార్క్, గ్రీన్‌లాండ్ ప్రభుత్వాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రతిగా డెన్మార్క్ తన సైన్యాన్ని ఇప్పటికే గ్రీన్‌ల్యాండ్‌లో మోహరింపజేసింది. అయితే.. నోరాడ్ (ఉత్తర అమెరికా వైమానిక రక్షణ కమాండ్) మాత్రం ఇది రొటీన్ ఆపరేషన్స్ అంటూ చెబుతోంది. అమెరికా సైనిక విమానాలు త్వరలో గ్రీన్‌లాండ్‌లోని పిటుఫిక్ స్పేస్ బేస్ (మునుపటి తులే ఎయిర్‌ఫోర్స్ బేస్) వద్దకు చేరనున్నాయి. దీనిని దీర్ఘకాలిక రక్షణ కార్యకలాపాల భాగంగా పేర్కొంటూ.. అమెరికా, కెనడా, డెన్మార్క్ మధ్య ఉన్న రక్షణ సహకారాన్ని బలోపేతం చేయడమే లక్ష్యమని నోరాడ్ చెబుతోంది. అయితే.. అమెరికా చర్యలను డెన్మార్క్ మాత్రం ఖండిస్తోంది. ఉత్తర ధ్రువ ప్రాంతంలో తన సైనిక, వ్యూహాత్మక ఆధిపత్యాన్ని పెంచుకోవడం అమెరికా ఉద్దేశం అయ్యి ఉండొచ్చు. అయితే.. తమ ఆధీనంలో ఉన్న స్వయం పాలక గ్రీన్‌ల్యాండ్‌పై అమెరికా సైనిక చర్యలకు దిగితే అది తమ సార్వభౌమాధికారాన్ని సవాలు చేయడమేనని డెన్మార్క్ భావిస్తోంది. అదే జరిగితే నాటోలో విభేదాలు తప్పవని డెన్మార్క్ ప్రధాని ఇప్పటికే ట్రంప్‌కు స్పష్టం చేశారు. ఈ క్రమంలో.. తాజా పరిణామంతో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.

**ఏమిటీ నోరాడ్**

NORAD అంటే "North American Aerospace Defense Command". ఇది అమెరికాకెనడా కలిసి ఏర్పాటు చేసిన ద్వైపాక్షిక రక్షణ సంస్థ. దీని ప్రధాన పని ఉత్తర అమెరికా మీదకు వచ్చే విమానాలు, క్షిపణులు, అంతరిక్ష వాహనాలపై హెచ్చరికలు ఇవ్వడం.. గగనతల నియంత్రణ చేయడం, అలాగే సముద్ర మార్గాలపై పర్యవేక్షణ చేయడం. నోరాడ్ గ్రీన్‌ల్యాండ్‌లో ప్రధానంగా.. పిటుఫిక్ స్పేస్ బేస్ నుంచే తన కార్యకలాపాలు నిర్వహించుకుంటోంది. ఇది ఆర్కిటిక్ ప్రాంతంలో ఉన్న అత్యంత కీలకమైన సైనిక స్థావరం కూడా. పిటుఫిక్ బేస్‌లోని రాడార్ వ్యవస్థలు రష్యా, చైనా వంటి దేశాల నుండి వచ్చే బాలిస్టిక్ మిసైల్ దాడులను ముందుగానే గుర్తించడానికి ఉపయోగపడతాయి. గ్రీన్‌ల్యాండ్ స్వయం పాలనలో ఉన్నప్పటికీ.. విదేశాంగం, రక్షణ వ్యవహారాలు ఇంకా డెన్మార్క్ ఆధీనంలో ఉన్నాయన్నది తెలిసిందే. కాబట్టి NORAD కార్యకలాపాలకు డెన్మార్క్ అనుమతి కచ్చితంగా అవసరం. నాటో సభ్య దేశమైన డెన్మార్క్.. నోరాడ్‌లో కార్యకలాపాల్లో భాగస్వామి కూడా. ఈ మేరకు అమెరికాతో 1951లో ప్రత్యేక రక్షణ ఒప్పందం కుదుర్చుకుంది. అందుకే ఒప్పందం ప్రకారం ఇప్పుడు అమెరికా చర్యలను అడ్డుకోవడానికి లేదు. కానీ, గ్రీన్‌ల్యాండ్‌ను తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలని ప్రయత్నాలను మాత్రం అడ్డుకునే అవకాశం ఉంది. అదే జరిగితే.. యుద్ధం తప్పదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# వాణిజ్య యుద్ధం ఎవ్వరికీ మంచిది కాదు

## ట్రంప్ టారిఫ్ బెదిరింపులపై యూకే ప్రధాని స్టార్మర్

**లండన్:** గ్రీన్‌లాండ్‌ను సొంతం చేసుకునే క్రమంలో యూరప్ దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న తీవ్ర ఒత్తిడులపై యూకే ప్రధాని కీర్ స్టార్మర్ తనదైన శైలిలో స్పందించారు. అమెరికా, యూకే ఎప్పటిలా గానే సన్నిహిత మిత్ర దేశాలుగా కొనసాగు తాయన్న ఆయన..వాణిజ్య యుద్ధం వల్ల ఎవ్వరికీ లాభం కలగదన్నారు. సోమవారం ఆయన అత్యవసర మీడియా సమావేశంలో మాట్లాడారు. గ్రీన్‌లాండ్‌ను సైనిక చర్య ద్వారా స్వాధీనం చేసుకునేందుకు ట్రంప్ ప్రయత్ని స్తున్నారంటూ వస్తున్న వార్తలను ఖండించారు. మిత్ర దేశాలపై టారిఫ్‌లను అస్త్రంగా ప్రయో గించడం పూర్తిగా తప్పన్నారు. అదే సమయంలో, యూకే జాతీయ ప్రయోజనాల పరిరక్షణే తన బాధ్యతన్నారు. 'అందుకే, భాగస్వామ్యం, వాస్తవాలు, పరస్పర గౌరవం ప్రాతిపదికగా ఈ సమస్యపై పరిష్కారం కనుగొనే క్రమంలో ఆదివారం ట్రంప్‌తో పాటు యూరప్ దేశాల నేతలు, నాటో సెక్రటరీ జనరల్‌తో ఫోన్‌లో మాట్లాడా. ఎందుకంటే, బలమైన కూటములు తమ ఉమ్మడి ప్రయోజనాలను ఆ విధంగానే కాపాడుకుంటాయి'అని వ్యాఖ్యానించారు. ట్రంప్‌తో



క్రమం తప్పక మాట్లాడు తూనే ఉంటానన్న స్టార్మర్.. విభేదాలున్నా లేనట్టుగా నటించడం కాదు, వాటిని ముఖా ముఖి చర్చించి పరిష్కరించుకోవడమే పరిణతి చెందిన కూటముల లక్షణమని చెప్పారు.

# బ్రిక్స్ దేశాల డిజిటల్ కరెన్సీలు అనుసంధానం?


అంతర్జాతీయ వాణిజ్యం, పర్యాటక రంగాల్లో చెల్లింపుల ప్రక్రియను మరింత సరళతరం చేసే దిశగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక అడుగు వేసింది. బ్రిక్స్(BRICS) కూటమిలోని సభ్య దేశాల అధికారిక డిజిటల్ కరెన్సీలను (CBDC) పరస్పరం అనుసంధానించాలని ఆర్‌బీఐ ప్రతిపాదించినట్లు తెలుస్తుంది. ఈ చర్య ద్వారా అంతర్జాతీయ లావాదేవీల్లో అమెరికా డాలర్‌పై ఉన్న ఆధిపత్యాన్ని తగ్గించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**2026 బ్రిక్స్ సదస్సు అజెండాలో..**

2026లో జరగనున్న BRICS సదస్సులో ఈ ప్రతిపాదనను ప్రధాన అజెండాగా చేర్చాలని కేంద్ర ప్రభుత్వానికి ఆర్‌బీఐ సిఫార్సు చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ ఏడాది చివర్లో భారత్ వేదికగా జరగనున్న బ్రిక్స్ సదస్సులో ప్రభుత్వం ఈ మేరకు చర్యలు చేపడితే సభ్య దేశాల డిజిటల్ కరెన్సీల అనుసంధానంపై తొలిసారిగా అధికారిక ప్రతిపాదన వెలువడే అవకాశం ఉంది.

**డీ-డాలరైజేషన్ దిశగా అడుగులు..**

బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాలతో కూడిన ఈ బ్రిక్స్ కూటమి ప్రత్యామ్నాయ చెల్లింపు వ్యవస్థల వైపు మొగ్గు చూపడంపై అమెరికా ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ




కూటమిని అమెరికా వ్యతిరేకంగా అభివర్ణిస్తూ సభ్య దేశాలపై భారీ సుంకాలు విధిస్తామని గతంలోనే హెచ్చరించారు. అయితే, భారత్ మాత్రం రూపాయి వాడకాన్ని విస్తరించే ప్రయత్నాలు డీడాలరైజేషన్ (డాలర్ వినియోగాన్ని తగ్గించడం) లక్ష్యంగా చేస్తున్నవి కావని, కేవలం వాణిజ్య సౌలభ్యం కోసమేనని స్పష్టం చేస్తోంది.

**2025 రియో డిక్లరేషన్‌కు కొనసాగింపు**

2025లో బ్రెజిల్‌లోని రియో డిజెనీరోలో జరిగిన బ్రిక్స్ సదస్సులో సభ్య దేశాల చెల్లింపు వ్యవస్థల మధ్య 'ఇంటరాపరబిలిటీ' (పరస్పర అనుకూలత) పెంచాలని నిర్ణయించారు. తాజా ఆర్‌బీఐ ప్రతిపాదన ఆ నిర్ణయానికి కొనసాగింపుగా కనిపిస్తోంది. ప్రస్తుతం బ్రిక్స్ దేశాల్లో ఏదీ పూర్తిస్థాయిలో డిజిటల్ కరెన్సీని విడుదల చేయనప్పటికీ ఐదు ప్రధాన దేశాలు పైలట్ ప్రాజెక్టులను విజయవంతంగా నిర్వహిస్తున్నాయి.

**భారత 'ఈ-రూపీ' పురోగతి**

భారత్ తన డిజిటల్ కరెన్సీ రంగంలో గణనీయమైన పురోగతి సాధించింది. డిసెంబర్ 2022లో ప్రారంభమైన 'ఈరూపీ'కి ప్రస్తుతం 70 లక్షల మంది రిటైల్ వినియోగదారులు ఉన్నారు. ఆఫ్‌లైన్ చెల్లింపులు, ప్రభుత్వ సబ్సిడీల కోసం ఆర్‌బీఐ కొత్త ఫీచర్లను పరిచయం చేస్తోంది. మరోవైపు చైనా కూడా తన డిజిటల్ యువాన్ అంతర్జాతీయ వినియోగాన్ని పెంచేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది.

**సవాళ్లు..**

బ్రిక్స్ దేశాల డిజిటల్ కరెన్సీల అనుసంధానం అంత సులభం కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దేశాల మధ్య ఉండే వాణిజ్య అసమతుల్యతలు, సాంకేతిక పరమైన భిన్నత్వాలు, పాలనా నియమాలను ఏకీకృతం చేయడం వంటి అంశాలపై లోతైన చర్చలు జరగాల్సి ఉంది. ఈ ప్రతిపాదనపై ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వం లేదా ఇతర సభ్య దేశాల కేంద్ర బ్యాంకులు ఇప్పటివరకు అధికారికంగా ఎటువంటి బహిరంగ ప్రకటన చేయలేదని గమనించాలి.

